క్లుప్తంగా

వేధిస్తున్న యువకుడిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను వేధిస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన పత్తిపాటి జయలలిత(22) కాలనీలో ఉంటున్న బాబాయి, పిన్నితో నివసిస్తోంది. కాలనీలోని బ్లాక్ నెం 10లో నివసించే సూరాబత్తుల దేవిశ్రీప్రసాద్, జయలలిత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల దేవిశ్రీప్రసాద్ వయస్సు జయలలిత కంటే తక్కువగా ఉండటం, ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మాట్లాడుకోవడం లేదు. దేవిశ్రీప్రసాద్ మూడు రోజుల క్రితం జయలలిత ఇంటికి వెళ్లి అసభ్యకరంగా మాట్లాడటమే కాకుండా ఇబ్బందులకు గురిచేశాడు. పెళ్లి ఇష్టం లేదని కాగితంపై రాసి ఇవ్వాలని వేధించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద కళావేదికపై శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. దత్త, శేయ అక్షిత, దుర్గాభవానీ, చంద్రిక, వైష్ణవి, సుభిక్ష, యశస్విని, వాసంతి, హరిప్రియ పలు కీర్తనలకు చక్కటి నృత్య ప్రదర్శన ఇచ్చారు. వారికి దేవస్థాన అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందచేశారు. సాయంత్రం పంచహారతుల సేవ తర్వాత జరిగిన నృత్యప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

కేబీఎన్‌లో యాంటీ డ్రగ్ డ్రైవ్



మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దగ్గరైతే జీవితం అంధకారమవుతుందని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం 'యాంటీ డ్రగ్ డ్రైవ్'పై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశలోమత్తుకు అలవాటు పడితే ఆ జీవితం చెడుబాట పడుతుందన్నారు. మాదకద్రవ్యాలను స్వీకరించటమే కాకుండా వాటిని కలిగి ఉన్నా తీవ్రమైన శిక్షలను వేయాలని చట్టం చెబుతోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ దేశంలోని యువత ఏమాత్రం తప్పటడుగులు వేసి మత్తుకు అలవాటు పడితే దేశాభ్యున్నతి కుంటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షబ్బీర్‌అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ శేషగిరిరావు, పవన్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



రక్తదాన శిబిరంలో డాక్టర్ అచ్యుతబాబు, చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, శారదావాణి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాప్‌లో ఇంటర్నేషనల్ ఎలియన్స్ క్లబ్ 225ఎస్ ఎన్టీఆర్ జిల్లా గవర్నర్ కందుల శారదావాణి ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన సదస్సు, రక్తదాన శిబిరం జరిగింది. తొలుత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. సదస్సుల్లో పాల్గొన్న అమెరికన్ అంకాలజీ వైద్యులు అనిల, రైల్వే డాక్టర్ సుమలత, ఆంధ్రా హాస్పటల్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేకే చివరి దశ వచ్చేవరకు తెలియడం లేదన్నారు.

అనంతరం కార్యక్రమంలో వైద్యులతోపాటు రైల్వే వాగ్యన్ వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రవీంద్రనాథ్, ప్రొడక్షన్ ఇంజినీర్ కె.సంపత్‌కుమార్, రైల్వే స్పెషల్ ఆఫీసర్ శిఖినం శ్రీనివాసరావు మొక్కలు నాటించడంతోపాటు ప్లాస్టిక్ ర హిత జిల్లాగా తీర్చిదిద్దే క్రమంలో నార సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ వెంకటేష్, ఎస్ఎన్‌జీ అలియన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మణిమాల, సెక్రటరీ సతీష్, కేవీడీ ప్రసాద్, వర్క్‌షాప్ కార్మికులు పాల్గొన్నారు.

వెండితెర ఆభరణం

- కాశీనాథుని విశ్వనాథ్
- నగరంతో అనుబంధం

విజయవాడ కల్చరల్: తెలుగు సినిమాకు గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన మహాదర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్. ఆయన అనేక ప్రశస్తమైన సినిమాల సృష్టికర్త. తెలుగు సినిమా కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పి అనేక కళాత్మక దృశ్యకావ్యాలను అందించిన వెండితెర ఆభరణం విశ్వనాథుడు. వెండితెరపై సాగరసంగమం, శంకరాభరణాన్ని సృజించిన కళాతపస్వి. ఆయనకు నగరంతో జిల్లాలోని అనేక ప్రాంతాలతో అనుబంధముంది. విశ్వనాథుడు నగరంతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో ఆయనకు మిత్రులు, సన్నిహితులకు కొదువలేదు. విశ్వనాథ్ సోదరి విశాలాక్షి లబ్బీపేటలో ఉండేవారు. నగరానికి వచ్చినప్పుడల్లా ఆమె ఇంటికి వెళ్లేవారు. 1994లో ఆంధ్రనాటక కళాపరిషత్ స్వర్ణోత్సవ సంబరాల్లో కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాసాహెబ్ పురస్కారం అందుకున్నసందర్భంగా లైఫ్‌టైమ్ అవార్డు అందుకోవడానికి నగరానికి వచ్చారు.

కళాదర్శని ఉత్సవాల్లో విశ్వనాథ్

లయోలా కళాశాల అనుబంధ సంస్థ కళాదర్శని ఏటా వార్షిక సాంస్కృతిక ఉత్సవాలు, పోటీలు జరుగుతాయి. 2005లో జరిగిన ఉత్సవాలకు కళాతపస్వి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి 76వ జయంతి సందర్భంగా నిర్వాహకురాలు పరచూరి విజయలక్ష్మి ఆధ్వర్యాన 2012లో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మహానటి సావిత్రి పురస్కారంతోసత్కరించారు. రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ 2018లో విశ్వనాథ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సత్కరించింది.



విశ్వనాథ్ సంతాప సభలో చిత్రకారుడు ఎస్వీ రామారావు,గోళ్ళ నారాయణరావు, చిట్టిబాబు తదితరులు

నగరానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావుతో విడదీయలేని బంధం ఉండేదని ఆయన దర్శకత్వం వహించిన జీవనజ్యోతి, సప్తపది , కాలంమారింది చిత్ర కథా చర్చలు తుర్లపాటి ఇంట్లోనే జరిగాయని తుర్లపాటి కుమారుడు జవహర్‌లాల్ వివరించారు.

మా కుటుంబ సభ్యుడు

శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు. కుటుంబ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనే వారని హైదరాబాద్ వెళ్లిన ప్రతి సందర్భంలోనూ ఆయనతో ముచ్చటించే అవకాశం కలిగిందని తెలిపారు.



తమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సన్మాన సభలో విశ్వనాథ్(ఫైల్)

విశ్వనాథ్‌కు నివాళి

విజయవాడ కల్చరల్: సంచలన చిత్ర దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ అని అంతర్జాతీయ తెలుగు చిత్రకారుడు ఎస్వీ రామారావు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో దర్శకుడు విశ్వనాథ్ సంతాప సభను కొత్తా పూర్ణానందం కళా వేదికమీద శుక్రవారం నిర్వహించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు, వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, చలపతిరావు పాల్గొన్నారు.

- నగరానికి చెందిన కళాసంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, సీహెచ్‌వీ సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, నిడుమోలు రమాసత్యనారాయణ, విద్యావేత్త ఎంసీదాస్ సంతాపం వ్యక్తం చేశారు.

పారుపల్లి ప్రేరణ

నగరానికి చెందిన సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వేషధారణకు ఆకర్షితుడై శంకరాభరణం సినిమాలో శంకరశాస్త్రి పాత్రలో అలా చూపించారని సంగీత ప్రయోక్త మోదుమూడి సుధాకర్ తెలిపారు. ఆ సినిమా విజయవంతం కావడంతో నగరంలోని అప్సర టాకీస్ నుంచి నేరుగా గాంధీనగర్‌లోని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విగ్రహాన్ని దర్శించుకున్నారని తెలిపారు. ఆయన సభకు వ్యాఖ్యానం చేయడం అదృష్టం 2017లో భాషా సాంస్కృతిక శాఖ, భిరుచి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన జరిగిన విశ్వనాథ్ అభినందన సభకు వ్యాఖ్యానం చేయడం తమ అదృష్టంగా భావిస్తునట్లు వ్యాఖ్యాతలు పూర్ణ తంగిరాల, బీ జయప్రకాష్ తెలిపారు.

రూమ్ నెం:421

కళాతపస్వి జిల్లాకు వచ్చినప్పుడు గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో రూమ్ నెం 421లో దిగటం ఆయన సెంటిమెంట్‌గా భావించేవారు. అక్కడే బసచేసేవారని హోటల్ నిర్వాహకుడు ఐలాపురం రాజా తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం 38వ డివిజన్ 159వ వార్డు సచివాలయం పరిధిలో ఆయన స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఇంటిలో ఆ కుటుంబానికి అందుతున్న పథకాలగురించి వివరిస్తూ వాటికి సంబంధించిన వివరాలతోకూడిన బ్రోచర్‌ను అందజేస్తూ ముందుకు సాగారు.

సచివాలయ నిధులతో సమస్యల పరిష్కారం

నియోజకవర్గంలో 90 వార్డు సచివాలయాలు ఉండగా ఇప్పటికే 86 పూర్తయ్యాయన్నారు. డివిజన్‌లోని కొండ ప్రాంతంలో చాలా వరకు మెట్లు, డ్రెయిన్ నిర్మాణాలను చేశామని, మిగిలిన వాటిని సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షలతో త్వరితగతిన అభివృద్ధి చేస్తామని వెలంపల్లి పేర్కొన్నారు.

నిధులన్నీ చంద్రబాబు అమరావతికి మళ్లించారు

నగరాభివృద్ధికి కేటాయించిన నిధులను అమరావతి..



పథకాలు అందుకున్న లబ్ధిదారులతో వెలంపల్లి, కార్పొరేటర్ రెహమతున్నీసా

అమరావతి అంటూ అక్కడికి తరలించి విజయవాడ నగరాభివృద్ధిని నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు అని వెలంపల్లి అన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత నగరాభివృద్ధికి నిధులు కేటాయించారని, రోడ్లు నిర్మించి, డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేశామని, తాగునీటి సరఫరాను పటిష్టం చేశామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, ఎస్‌కే నజీర్, కరీముల్లా, ఇస్మాయిల్, మంటి రాము, లేళ్లపూడి లాజర్, కర్నాటి రాంబాబు, పోలిమెట్ల శరత్ బాబు, బూదాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి మహిళలకు మాల్వియా యాత్ర స్ఫూర్తిదాయకం

జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మహిళా సాధికారత సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న ఆశా మాల్వియా నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ అన్నారు. మధ్యప్రదేశ్ నుంచి ఢిల్లీ వరకు సంపూర్ణ భారత యాత్ర చేస్తున్న సైక్లిస్ట్ ఆశా మాల్వియా శుక్రవారం జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌ను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాల్వియాను అభినందించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆశా మాల్వియా 'సంపూర్ణ భారత్ యాత్ర' నవంబర్ 1న మధ్యప్రదేశ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఫ్లాగ్ ఆఫ్ చేయబడిందన్నారు. ఆమె తన యాత్రలో భాగంగా ఎనిమిది రాష్ట్రాల్లో 8, 545 కిలోమీటర్లు ప్రయాణించారన్నారు. మాల్వియా మాట్లాడుతూ దేశంలో మహిళలకు పూర్తి భద్రత ఉండాలని, మహిళా భద్రత, సాధికారతపై దేశమంతటా సైక్లింగ్ చేస్తున్నానన్నారు. ఇప్పటికే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఏపీ రాష్ట్రాలను కవర్ చేస్తూ సైకిల్ యాత్ర. పూర్తి చేశానన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి హేమచంద్ర, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి యు. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సైకిల్ యాత్రికురాలు ఆశా మాల్వియాతో జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్‌కుమార్

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ ఘట్టాన్ని చూసిన భక్తులు పరవశించారు. ఆలయ ప్రాంగణంలో కళావేదికపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి ఆగమ పండితులు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వందలాది మంది దంపతులు ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం స్వామివారి పారమార్థిక హోమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం గులాభిలతో సహస్రనామార్చన చేశారు.

వైభవంగా గజవాహనోత్సవం

స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సాయంత్రం గజవాహనోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఉత్సవం బ్రాహ్మణవీధి, పూలబావి వీధి, మెయిన్‌రోడ్డు, శేషయ్యవీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నృత్య కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నృత్యాంశాలను రమణీయంగా ప్రదర్శించి అలరించారు.



స్వామి వారి కల్యాణోత్సవం,

ట్రాఫిక్ పోలీసులకు స్టాపర్స్ అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్ ట్రాఫిక్ పోలీసులకు వేగ జ్యూయలర్స్ సంస్థ స్టాపర్స్ (బారికేడ్లు)ను అందజేశారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి మైలురాయి సెంటర్‌కు వచ్చిన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐ రామచంద్రరావుకు 60 బారికేడ్లను అందజేయగా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రామచంద్రరావు మాట్లాడుతూ విపోలీసులకు ఉపయోగపడేలా నగరం మొత్తానికి 600 బారికేడ్లను వేగ జ్యూయలర్స్ సంస్థ అందజేసిందని తెలియ చేశారు. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు 60 బారికేడ్లను ఇక్కడికి కేటాయించగా సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ ఎస్సై అర్జునరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీ రామచంద్రరావుకు బారికేడ్లను అందజేసిన వేగ జ్యూయలర్స్ ఎండీ నవీన్ తదితరులు

సాక్షి ప్రీమియర్ లీగ్ ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి సీనియర్స్, జూనియర్స్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జూనియర్స్ విభాగంలో ఎన్నార్ఐ జట్టు, సీనియర్స్ విభాగంలో నలంద జట్టు ట్రోఫీ గెలుపొందాయి. విజేతలకు, రన్నర్స్‌కు ఎన్టీ ఆర్ జిల్లా కమిషనర్ టీకే రాణా బహుమతులు అందజేశారు. అతిథులు క్రీడాకారులను అభినందించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



జూనియర్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన గవర్నమెంట్ కాలేజీ జట్టు



సీనియర్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన లయోల జట్టు

అభివృద్ధి బాట



నాడు... గతంలో ఆర్‌యూబీ మార్గంలో ప్రయాణికులు ఎదుర్కొనే ఇబ్బందులు



నేడు.... తారురోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత ఆర్‌యూబీ మార్గం

సింగ్‌నగర్‌లోని ఆర్‌యూబీ రోడ్డును నిర్మించారు. గతంలో విష్ణు హయాంలో ఆర్‌యూబీ మార్గాన్ని నిర్మించదానికి అనుమతులు తీసుకొచ్చి శ్రీకారం చుట్టారు, ఇది పూర్తయి తర్వాత టీడీపీ హయాంలో దీన్ని పట్టించుకోపోవడంతో గోతులు పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనికి మరమ్మతులు చేశారు. అయితే ఇటీవల కొత్తగా రోడ్డు నిర్మించారు.

- అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్)

వెలంపల్లిపై విమర్శలు చేస్తే సహించం:పొట్నూరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేస్తే సహించబోమని చల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ (దేవదాయ శాఖ) డైరెక్టర్ పొట్నూరి రాజా అన్నారు. ఈ సందర్భంగా కోమలవిలాస్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పొట్నూరి రాజా మాట్లాడుతూ వెల్లంపల్లి శ్రీనివాసరావు కులమతాలకు అతీతంగా అందరిని గౌరవిస్తూ చక్కగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పోతిన వరప్రకాష్, కర్రి గౌరి, కొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య మహాసభ కమిటీ ప్రమాణ స్వీకారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో ఈనెల ఐదో తేదీన జరిగే ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్రేటర్ విజయవాడ నగర కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం బ్రోచర్‌ను వెలంపల్లి శ్రీనినవాసరావు తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు.ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు కొల్లా అనిల్‌ప్రసాద్, సముద్రాల ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు చాత్తాద శ్రీవైష్ణవ సంఘ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని హెచ్‌ఆర్‌టీ ఫార్మా కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఏపీ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని ఈ నెల 5వ తేదీ ఉదయం 9.05 గంటలకు సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు ఇంజినీర్ శోభనాద్రి, ఏపీ చాత్తాది శ్రీవైష్ణవ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ టీ మనోజ్‌కుమార్‌లు ప్రారంభించనున్నారని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ యశోద శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ పూజ కార్యక్రమం అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పాజీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట బురాడ వారి వీధి మొదటి అడ్డ రోడ్డు నిర్మాణ పనులను 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుమారు ఏడు లక్షల వ్యయ అంచనాతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో అంజి, నారాయణరావు, పడాల రాజేష్, ఖాజా,పిళ్లా మహేష్, కాంట్రాక్టర్ ఆదిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి



ఐకానిక్ పార్కును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు పలు సూచనలు చేశారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఈ ప్రాంతాలను సందర్శించారు. ఎక్సెల్‌ప్లాంట్ ప్రవేశ ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డ్ రూము, రోడ్ల పనులను పూర్తి చేయాలని, ప్రవేశ ద్వారం నుంచి వేబ్రిడ్జి వరకు ఉన్న మార్గాన్ని బీటీ రోడ్డు వేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన ఐకానిక్ పార్కు పనులను పరిశీలించారు. పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనుల పరిశీలన

వీఎంసీ కమిషనర్ అధికారులతో కలసి జాతీయ రహదారి వెంట జరుగుతున్న ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, పనుల వివరాలను రిపోర్ట్ చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రామవరప్పాడు రింగు నుంచి నిడమానూరు జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేరకు జరగాల్సిన పనులను 15 రోజుల లోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఈఈలు ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, నారాయణమూర్తి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయుడి పునఃప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీదత్తాత్రేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పూజలు చేశారు.

ప్రతిష్టా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, చతుర్వేద పారాయణం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.